
సాక్షి పల్నాడు

శనివారం । 13 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం శుక్రవారం 522.20 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 5,088, జలవిద్యుత్ కేంద్రానికి 26,950 క్యూసెక్కులు విడుదలవుతోంది.



గోదాదేవికి సారె సమర్పణ

పెదకూరపాడు: పెదకూరపాడులో రాజా వేణుగోపాలస్వామి దేవస్థానంలో శుక్రవారం గోదాదేవి అమ్మవారికి, దేవతమూర్తులకు సారె సమర్పణ వైభవంగా నిర్వహించారు.

విజయకీలాద్రిపై ధనుర్మాస వేడుకలు



తాడేపల్లిరూరల్ : సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ధనుర్మాస వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శుక్రవారం కూడార్రై ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు.

మంత్రముగ్గుల సంక్రాంతి

- అంబరాన్నంటిన సంబరాలు
- ఆకట్టుకున్న రంగవల్లులు
- ఘుమఘుమలాడిన పిండి వంటలు
- సత్తెనపల్లిలో ముందస్తు సంక్రాంతి సందడి
- సంబరాలకు పోటెత్తిన జనసందోహం

సత్తెనపల్లి: సంక్రాంతి సంబరం ... ఆనందాల అంబరం ... సంప్రదాయాల సోయగం ... ఆట పాటల కోలాహలం... ఏడాదిగా ఎదురు చూస్తున్న పెద్ద పండుగ సంక్రాంతి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో పది రోజులు ముందుగానే వచ్చింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి వైఎస్ఆర్ సంక్రాంతి గ్రామీణ పోటీలు నిర్వహించారు. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా రంగు రంగుల ముగ్గులతో పుడమి తల్లి పులకించింది. ఎటు చూసినా సంక్రాంతి సందడే కనిపించింది. ఊరువాడా ఏకమై సంప్రదాయ శోభతో పట్టణం, పల్లెలు కళకళలాడాయి. రంగవల్లులతో అంతటా నిండి పోయాయి.

పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఓవైపు మహిళలు సామూహికంగా నియోజకవర్గస్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లో తలపడుతుంటే, మరోవైపు సాంస్కృతిక కార్యక్రమాలు, ఇంకోవైపు సంబరాలను తిలకించేందుకు వచ్చిన వారికి అక్కడికక్కడే తయారు చేయించిన ఘుమఘుమలాడే అరిసెలు, పూర్ణాలు, పాలతాలికలు, గారెలు, పులిహోర వంటి పిండి వంటలు అందించారు. దీంతో సంక్రాంతి సంబరాల కోలాహలం సందడిగా సాగింది. పెద్దఎత్తున జన సందోహం తరలివచ్చారు. కేరింతలు కొడుతూ సంబరాల్ని వీక్షించారు. సంక్రాంతి సంబరాలు నిమిత్తం పెద్ద ఎత్తున తరలి వచ్చిన జన సందోహానికి, మహిళలకు లోటుపాట్లు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

పెద్దఎత్తున ప్రజాప్రతినిధులు హాజరు

సంక్రాంతి సంబరాల్లో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి అంబటి రాంబాబు, సతీమణి విజయలక్ష్మి, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు, శాసనసభ్యుడు నంబూరి శంకర రావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్ఆర్ సీపీ గుంటూరు రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ గీత హాసంతి, నాయకులు పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబూరావు, షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, షేక్ మౌలాలి, రాయపాటి పురుషోత్తమరావు, కళ్లం విజయ భాస్కర్‌రెడ్డి, భవనం రాఘవరెడ్డి, వేపూరి శ్రీనివాసరావు, నక్కా శ్రీను, అచ్యుత శివప్రసాద్, రాజుపాలెం జెడ్పీటీసీ సునీతారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, కొణతం స్వాతి, గంగారపు అనూషా, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా మంత్రి రోజా, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, మంత్రి అంబటి రాంబాబు కోళ్లను చూపుతూ పందెం నిర్వహించారు. సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ నేతృత్వంలో సీఐలు, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది నిత్యం పర్యవేక్షణ చేస్తూ ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా బందో బస్తు నిర్వహించారు.



కోళ్లతో మంత్రి రోజా, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, పక్కన మంత్రి అంబటి రాంబాబు



ముగ్గులను పరిశీలిస్తున్న మంత్రి రోజా

2024.. వన్స్‌మోర్ ఏపీ సీఎం జగన్: మంత్రి రోజా

రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వన్స్‌మోర్ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ఏపీ పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన వేడుకలలో శుక్రవారం రాత్రి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముగ్గుల పోటీలు నిర్వహించి మహిళల్ని ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతు బాంధవుడిగా పని చేస్తున్నారన్నారు. నాడు వైఎస్ఆర్‌కు భక్తుడిగా, నేడు జగనన్నకు సైనికుడిగా అంబటి రాంబాబు పని చేస్తున్నారని ప్రశంసించారు. అందరి ఆశీస్సులు ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీకి ఉండాలని, రానున్న ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ తనను ఓడించేందుకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పప్పు లోకేష్ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. నక్కజిత్తుల చంద్రబాబు, పారితోషికం తీసుకోకుండానే పవన్ కళ్యాణ్ డాన్స్ చేస్తున్నాడా ? అని విమర్శించారు. తాను కార్యకర్తల ఆనందం కోసం భోగినాడు తాండవం చేస్తానన్నారు. తనపై అనేక విమర్శలను టీడీపీ, జనసేన చేస్తున్నాయని మండిపడ్డారు. వీటికి తోడు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ 5, ఏబీఎన్ అభాసుపాలు చేయాలని ప్రయత్నం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ముగ్గుల పోటీలకు మహిళల నుంచి ఏటా ఆదరణ పెరుగుతోందని, ఈ ఏడాది 12,916 మంది వచ్చారంటే ఆదరణ ఏ స్థాయిలో పెరిగిందో ఆలోచించాలని తెలిపారు.

అవనిపై హరివిల్లు

సంక్రాంతి సంబరాలను పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలు పాఠశాల ప్రాంగణంలో కల్లాపి చల్లి రంగు రంగుల ముగ్గులు వేశారు. వాటిల్లో గొబ్బెమ్మలను ఉంచి అందంగా అలంకరించారు. నియోజకవర్గం స్థాయి వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీలకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, ఒక పట్టణం నుంచి మండల, పట్టణ స్థాయిలో గెలుపొందిన 25 మంది మహిళలు సామూహికంగా తమలో దాగున్న ప్రతిభను వ్యక్తపరుస్తూ ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలు డాక్టర్ షకీలా శ్రీధర్, ఎం.గీతాంజలి, ఈ.మైథిలీ క్షుణ్ణంగా ముగ్గులను పరిశీలించి నియోజకవర్గ స్థాయిలో ఐదుగురు విజేతల్ని ఎంపిక చేశారు. అనంతరం వారిని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రకటించారు. ప్రథమ స్థానం ఎం.అశ్విని (కుంకలగుంట), ద్వితీయ స్థానం సీహెచ్. వెంకాయమ్మ(అనుపాలెం), తృతీయ స్థానం ఆర్.సుబ్బులు(నర్సింగపాడు), చతుర్థ స్థానం కె.ప్రసన్న(చాగంటివారిపాలెం), ఐదవ స్థానం పి.పద్మావతి(23వ వార్డు సత్తెనపల్లి టౌన్)లు కైవసం చేసుకున్నారు. మిమిక్రీ రమేష్, స్వప్నలు అలరించారు.రోహిత్, రవిల డ్యాన్స్ బృందాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



ప్రథమ స్థానం సాధించిన ముగ్గు



ద్వితీయ స్థానం పొందిన ముగ్గు



తృతీయ స్థానంలో నిలిచిన ముగ్గు

న్యూస్‌రీల్

గుంటూరు రేంజ్‌లో నలుగురికి ఉత్తమ పతకాలు

నగరంపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో పోలీస్ అధికారులు, సిబ్బందికి ఉత్తమ, సేవా పతకాలను ప్రకటిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో ఎంపిక చేసిన వారికి ఉగాది పండుగనాడు పతకాలను అందజేయనున్నారు. గుంటూరు రేంజ్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలలో నలుగురుకి ఉత్తమ, నాలుగు సేవా పతకాలు లభించాయి. ఇక సేవా పతకాలలో ఏఎస్ఐల నుంచి కానిస్టేబుళ్ల వరకు గుంటూరు -4, బాపట్ల- 3, పల్నాడు- 3, ప్రకాశం -4, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో ఐదుగురు అర్హత సాధించారు.

ఐలవరంలో శోభాయాత్ర



ఐలవరం(భట్టిప్రోలు): వివేకానంద విద్యా గ్రామీణాభివృద్ధి సంస్థ, (ఐలవరం) సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఐలవరంలో స్వామి వివేకానందుని జయంతి ఉత్సవాలు వేణుగోపాల స్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. పురవీధులలో వివేకానందునికి జై, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ శోభాయాత్ర చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు జంజనం హేమశంకర రావు, జెడ్పీటీసీ మాజీ సభ్యులు బండారు శ్రీనివాసరావు, జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, రేపల్లె ఖండ ప్రముఖ్ క్రాప రవికుమార్, ఎంపీటీసీ సభ్యులు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ అందె వెంకటేశ్వర్లు, నిర్వాహకులు పడమట వెంకటేశ్వరరావు, వి.కోటేశ్వరరావు, కె.బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల కోసం కళాకారులు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ క్రీడా ప్రాంగణంలో ఈనెల 14వ తేదీ భోగి, 15న మకర సంక్రాంతి సందర్భంగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకలలో భాగంగా ఔత్సాహిక కళాకారులు నృత్యం, పాటలు, సంగీతం తదితర వాటిలో వారి వారి ప్రతిభను చూపేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తుదారులు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.శామ్యూల్ 91827 17818, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు 80742 76942 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

రూ. 6.20 లక్షలు అపరాధ రుసుం విధింపు



భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 70 బృందాలు గృహ, వాణిజ్య సర్వీసులను పరిశీలించారు. 5,588 సర్వీసులను తనిఖీ చేయగా వాటిలో 148 సర్వీసులు విద్యుత్ లోడు అధికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ. 6.20 లక్షలు అపరాధ రుసుం విధించినట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ విజిలెన్స్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (గుంటూరు) పీవీ మల్లికార్జునరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలలో రేపల్లె డీఈఈ నెమలికంటి భాస్కరరావు, భట్టిప్రోలు ఏఈఈ పెరవలి ఏడుకొండలు, తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు



పట్నంబజారు : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు టికెట్లు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. కాంట్రాక్టు గ్యారేజీ బస్సులకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే నిబంధనలు ఉల్లంఘించిన 49 బస్సులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామోదయం, నగరోదయంతో సత్ఫలితాలు

జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: గ్రామోదయం, నగరోదయంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సత్ఫలితాలు కన్పిస్తున్నాయని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. ఆయన శుక్రవారం సాయంత్రం అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో శ్రద్ధ వహించాలని ఆయన చెప్పారు. తాను ఇటీవల అమరావతి మండలంలో పర్యటించానన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ నీటి పథకం పనులు అస్తవ్యస్తంగా ఉన్నాయని తెలిపారు. దారి మధ్యలో పైపులు వేశారని, వాటిని సరి చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు చెప్పారు. పారిశుద్ధ్యం, డ్రైనేజీ పనుల్ని సక్రమంగా చేయాలని సూచించానని పేర్కొన్నారు. అనంతరం రూరల్, మున్సిపల్ ప్రాంతాలలో గ్రామోదయం, నగరోదయం ద్వారా చేసిన సేవలు, పనుల్ని మండల స్పెషల్ ఆఫీసర్స్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష , బంగారు తల్లి పథకాల అమలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి, కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమాల అమలు గురించి వివరించారు. వాటిని శ్రద్ధగా కలెక్టర్ విన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మార్పు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించాలని చెప్పారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో మాచర్ల మున్సిపాలిటీకి ఎనిమిదో ర్యాంక్, మరో మున్సిపాలిటీకి 17వ ర్యాంకు వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ , డీఆర్‌వో వినాయకం సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



అధికారులతో సమీక్షలో కలెక్టర్

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకర రావు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లో ఆయన వైద్య పరీక్షల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిబిరంలో 724 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి గ్రామంలో ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యల్ని గుర్తిస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 66 రకాల వైద్యపరీక్షలను ఉచితంగా స్పెషలిస్ట్ డాక్టర్లు నిర్వహించి, 105 రకాల మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలో సుమారు రూ.25 కోట్లతో ప్రభుత్వాస్పత్రులు ఆధునీకరిస్తున్నామని తెలిపారు. ఆరోగ్య శ్రీ పరిధిని కూడా రూ.25 లక్షలకు పెంచిన ఘనత సీఎం జగనన్నదేనని వివరించారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్యం కోసం నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరలా ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు.



గ్రామోదయంలో కలెక్టర్‌తో కలిసి మునగోడులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

సీహెచ్‌సీ పరిశీలన

స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మొదటి అంతస్తులో రూ.3.25 కోట్లతో ఏర్పాటు చేస్తున్న వివిధ విభాగాల పనుల్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా 30 పడకల ఆస్పత్రిగా ఉన్న సీహెచ్‌సీలో పడకలను పెంచి వివిధ విభాగాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీబ్యాంక్ డైరెక్టర్ కోట హరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జేసీఎస్ అధ్యక్షుడు నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు విజయసాగరబాబు, మునగోడు సొసైటీ అధ్యక్షుడు పుల్లారెడ్డి, అమరావతి, మునగోడు గ్రామ సర్పంచ్‌లు రాజేశ్వరి, విష్ణు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, అత్తలూరు సీహెచ్‌సీ వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మునగోడులో గ్రామోదయం

పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో కలిసి మండల పరిధిలోని మునగోడులో గ్రామోదయం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరరావు పాల్గొన్నారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ, మైనారిటీ కాలనీలను సందర్శించారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో చర్చించారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ సచివాలయంలో టీఏ ల్‌వోలతో ఆయన సమావేశమయ్యారు. పీడబ్ల్యూడీ ఓట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో కాఫీ విత్ క్లాప్ మిత్రా కార్యక్రమంలో భాగంగా క్లాప్ మిత్రాలతో అల్పాహారం చేశారు. వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. కొందరు అనారోగ్య సమస్యలను కలెక్టర్ శివశంకర్ దృష్టికి తీసుకురాగా, వారికి ఉచితంగా వైద్యసేవలు అందించటానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో పలు వీధుల్లో పర్యటించారు. వివక్ష లేకుండా గ్రామస్తులందరికీ అన్ని సేవలు అందజేయాలని అధికారుల్ని ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో ప్రతి ఇంటికీ కుళాయి తప్పనిసరిగా ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంకా విష్ణు, పీఏసీఎస్ అధ్యక్షుడు సింగం పుల్లారెడ్డి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మాచర్ల ప్రథమం

- పల్నాడు జిల్లాలో మొదటి ర్యాంక్
- రాష్ట్రస్థాయిలో 8వ స్థానం

మాచర్ల: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మాచర్ల మున్సిపాలిటీ సత్తా చాటింది. 2023 సంవత్సరానికి గానూ రాష్ట్ర స్థాయిలో 8వ స్థానం సాధించి, పల్నాడు జిల్లాలో తొలి పురపాలక సంఘంగా నిలిచింది. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచనల మేరకు పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని పట్టణంలో పటిష్టంగా నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో చెత్త సేకరణ, రీసైక్లింగ్, పారిశుద్ధ్య నిర్వహణ, కాలువలు పూడిక తొలగించడంపై అధికారులు శ్రద్ధ వహించారు. పారిశుద్ధ్య నిర్వహణను పక్కాగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమణబాబు మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో 25 ఎకరాల్లో డంపింగ్ యార్డు, ఐదు ఎకరాల్లో ఇండో కంపోస్టు యార్డు ఉందన్నారు. వీటిల్లో పనులు శ్రద్ధగా జరుగుతున్నాయని తెలిపారు. గ్రీన్ మాచర్ల నినాదంతో సిబ్బంది కూడా చిత్తశుద్ధితో పని చేయడం వల్లే ర్యాంకు వచ్చినట్లు చెప్పారు. దీనికి ప్రభుత్వ విప్ పీఆర్కే , వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్లు బోయ రఘురామిరెడ్డి, తురక కిషోర్ సహకారం అభినందనీయమని తెలిపారు. పట్టణ ప్రజల సహకారంతోనే మాచర్ల మున్సిపాలిటీ నేడు ర్యాంక్ సాధించినట్లు చెప్పారు. రాష్ట్రస్థాయిలో 97 మున్సిపాలిటీల్లో ఎనిమిదో స్థానంతో పాటు పల్నాడు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచినట్లు వివరించారు.



డంపింగ్ యార్డులో పనులు చేస్తున్న కార్మికులు

నిమ్మకాయల ధరలు



తెనాలి టౌన్ : గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ. 2,800, గరిష్ట ధర రూ. 3,800లు, మోడల్ ధర రూ. 3,400ల వరకు పలికింది.

డీఎస్ఏ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు

- రేపటి నుంచి 16వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- జిల్లా కలెక్టర్ శివశంకర్ వెల్లడి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో సంక్రాంతి సంబరాలు ఈనెల 14 నుంచి 16 వరకు సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం తెలిపారు. పట్టణ ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు.

- 14న ఉదయం భోగి మంటలు, ముగ్గులు, భోగి పండ్లు వంటి సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
- 15న సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు వివిధ కార్యక్రమాలు ఉంటాయి. అందులో ప్రముఖ సంగీత దర్శకురాలు యం.యం.శ్రీలేఖ కార్యక్రమం, అనంతరం జబర్దస్త్ టీం రాజమౌళి, వినోదిని, కెవ్వు కార్తీక్ ప్రదర్శనలు, చెన్నై వారిచే జగ్లింగ్, హైదరాబాద్ టీం నృత్యం, సంప్రదాయ దుస్తుల ప్రదర్శన, అనంతరం పాడుతా తీయగా ఫేం సుమంత్, సునంద కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.
- 16న సంగీత దర్శకుడు కుంచె రఘు జానపద పాటలు, ఈటీవీ జబర్దస్త్ టీం ఇమ్మానుయేలు, శాంతి స్వరూప్, నవీన్ కార్యక్రమం , అనంతరం హైదరాబాద్ టీం నృత్య ప్రదర్శన, బెంగుళూరు, గోవా రష్యన్ క్విక్ కార్యక్రమాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలి



మాచర్ల: పట్టణంలోని రోప్‌వే కాలనీ షాలోం మందిరంలో తీర్మాన పండుగల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు అనుసరించాలన్నారు. శుక్రవారం పట్టణంలోని రోప్‌వే కాలనీ చివరి భాగంలో షాలోం మందిరంలో జరిగిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. క్రైస్తవుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం పలువురు చర్చి పాస్టర్ల ఆశీస్సులు ప్రభుత్వ విప్ పీఆర్కే పొందారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తురక కిషోర్, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, వార్డు కౌన్సిలర్ మందా సంతోష్‌తోపాటు వందలాది మంది ప్రభువు భక్తులు పాల్గొన్నారు.

పర్యాటక శాఖ ప్రత్యేక ప్యాకేజీ



విజయపురిసౌత్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఏపీ టూరిజం ఆధ్వర్యంలో పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టినట్లు స్థానిక లాంచీస్టేషన్ మేనేజర్ శివారెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం నుంచి ఈనెల 16వ తేదీ వరకు నాగార్జునకొండకు వెళ్లే విద్యార్థుల కోసం లాంచీ టికెట్‌పై 15 శాతం డిస్కౌంట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. పర్యాటకుల కోసం అన్ని సౌకర్యాలు కల్పిస్తూ నాగార్జునకొండకు ప్రత్యేక లాంచీ సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, పర్యాటకులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మోపెడ్ నుంచి పడి వ్యక్తి మృతి



గుంజి వీరయ్య

మేదరమెట్ల: మోపెడ్‌పై వెళ్తున్న కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల దక్షిణ బైపాస్ సమీపంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఇంకొల్లు మండలం పావులూరు గ్రామానికి చెందిన గుంజి వీరయ్య (78) ఎండు మిర్చి విక్రయిస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. తెల్లవారు జామున మోపెడ్‌పై మిరపకాయలు తీసుకొని మేదరమెట్ల జాతీయ రహదారిపై నుంచి మద్దిపాడు వైపు వెళ్తుండగా.. ఏమైందో తెలియదు కాని, రోడ్డుపై పడి మృతి చెందాడు. సమాచారం మేరకు.. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వీరయ్య మృతదేహాన్ని పరిశీలించారు. మోపెడ్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదని, మృతుడికి కూడా ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. మృతుడి వద్ద ఉన్న ఫోన్ ఆధారంగా అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పి.నాగశివారెడ్డి తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగులంతా రెగ్యులరైజ్

గుంటూరు మెడికల్: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అందరినీ, ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా రెగ్యులరైజ్ చేయడం జరుగుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి శుక్రవారం తెలిపారు. రెగ్యులరైజేషన్ విషయంలో ప్రలోభాలకు లోను కావద్దని, ఈ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. దళారుల మాటలు నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దని పేర్కొన్నారు. సమాచారం కావాలన్నా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుళ్ల బదిలీ

నగరంపాలెం: జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వర్తించే 20 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఉత్తర్వులు జారీచేశారు. 20 మందిలో 13 మంది పురుషులు, ఏడుగురు మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. సుదీర్ఘకాలంగా ఒకే పీఎస్‌లో విధులు నిర్వర్తించే వారితోపాటు కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యలు కారణంగా స్థానచలనం చేయాలని విన్నవించగా, వారిని బదిలీ చేశారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



ప్రథమ స్థానం విజేత అశ్వినికి రూ.2 లక్షలు చెక్కు అందజేస్తున్న మంత్రులు రోజా, అంబటి రాంబాబు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు, ఎమ్మెల్సీ రాజశేఖర్



ద్వితీయ స్థానం సాధించి రూ.లక్ష చెక్కు అందుకుంటున్న వెంకాయమ్మ



తృతీయ స్థానం సాధించి రూ. 50 వేలు చెక్కు అందుకుంటున్న సుబ్బులు



చతుర్థ స్థానం సాధించి రూ. 25 వేల చెక్కు అందుకుంటున్న ప్రసన్న

సత్తెనపల్లి: సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం వైఎస్సార్ సంక్రాంతి గ్రామీణ ముగ్గుల పోటీల్లోని నియోజకవర్గ, మండల, పట్టణ స్థాయి విజేతలకు నగదు బహుమతులను అందించారు. ఇప్పటికే గ్రామస్థాయి, మున్సిపల్ వార్డు స్థాయి విజేతలకు బహుమతులు అందించిన విషయం తెలిసిందే. ముగ్గుల పోటీల్లో భాగస్వాములైన 12,916 మంది మహిళలకు ప్రోత్సాహక బహుమతులను ఇంటింటికి పంపనున్నారు. సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సాంస్కృతిక, యువజనాభివృద్ధి శాఖ మంత్రి ఆర్కే రోజా, రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శాసనసభ్యులు, ముఖ్య నాయకులు చేతుల మీదుగా నియోజకవర్గస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఎం.అశ్విని(కుంకలగుంట)కి రూ. 2 లక్షలు, ద్వితీయ స్థానం సాధించిన సీహెచ్.వెంకాయమ్మ(అనుపాలెం)కు రూ.లక్ష, తృతీయ స్థానం సాధించిన ఆర్.సుబ్బులు(నర్సింగ్‌పాడు)కు రూ.50 వేలు, చతుర్థ స్థానం సాధించిన కె.ప్రసన్న (చాగల్లు)కు రూ.25వేలు, ఐదో స్థానం సాధించిన పీ.పద్మావతి(23వ వార్డు సత్తెనపల్లి టౌన్)కు కన్సోలేషన్ బహుమతిని అందించారు.

పట్టణ స్థాయిలో..

పట్టణ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఎ.పూజిత (10వ వార్డు) రూ.25 వేలు, ద్వితీయ స్థానం సాధించిన కె.శివకీర్తి (15వవార్డు) రూ.15 వేలు, తృతీయ స్థానం సాధించిన పి.పద్మావతి (23వ వార్డు) రూ.10 వేలు, చతుర్థ స్థానం సాధించిన కె.నాగజ్యోతి (15వ వార్డు) రూ.5 వేలు, 5వ స్థానం సాధించిన ఎ.జ్యోతి (31వ వార్డు) కన్సోలేషన్ బహుమతిని అందుకున్నారు.

మండలస్థాయిలో...

సత్తెనపల్లి రూరల్ మండలంలో ప్రథమ స్థానం ఎ.అరుణ (పాకాలపాడు) ద్వితీయ స్థానం టీ రాజ్యలక్ష్మి (అబ్బూరు), తృతీయ స్థానం ఏ.సునిత (ధూళిపాళ్ల), చతుర్థ స్థానం టి రేణుక (గోగులపాడు) ఐదో స్థానం పి.అనురాధ (గుడిపూడి), ముప్పాళ్ల మండలం నుంచి ప్రథమ స్థానం ఏ నాగలక్ష్మి (చాగంటివారిపాలెం) ద్వితీయ స్థానం పి.సుజాత (మాదల), తృతీయ స్థానం టి.భాగ్యలక్ష్మి (దమ్మాలపాడు), చతుర్థ స్థానం ఎస్.రత్నకుమారి(మాదల), ఐదో స్థానం ఎం.లక్ష్మీ తిరుపతమ్మ(కుందురువారిపాలెం), రాజుపాలెం మండలం నుంచి ప్రథమ స్థానం పి.సౌజన్య (బీరవల్లిపాయ), ద్వితీయ స్థానం ఏ.వీరకుమారి (అంచులవారిపాలెం), తృతీయ స్థానం బి.అలేఖ్య (గణపవరం), చతుర్థ స్థానం సీహెచ్.వెంకాయమ్మ (అనుపాలెం), ఐదో స్థానం వేల్పుల ధనలక్ష్మి(పెద్ద నెమలిపురి), నకరికల్లు మండలం నుంచి ప్రథమ స్థానం సిహెచ్.లలిత (చీమలమర్రి), ద్వితీయ స్థానం ఎం.అశ్విని (కుంకలగుంట), తృతీయ స్థానం కె.ప్రసన్న (చాగల్లు), చతుర్థ స్థానం కె తేజశ్రీ (గుండ్లపల్లి), ఐదో స్థానం ఆర్.సుబ్బులు (నరసింగపాడు), విజేతలుగా నిలిచారు. వీరికి వరుసగా ప్రథమ స్థానానికి రూ.25 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు, చతుర్థ స్థానానికి రూ.5 వేలు, 5వ స్థానానికి కన్సోలేషన్ బహుమతులను ప్రదానం చేశారు. విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ఎం.అశ్విని పదో తరగతి వరకు విద్యనభ్యసించి వివాహం కావడంతో టైలర్‌గా పనిచేస్తోంది.

కోలాహలంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల విజేతలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి

- గంగిరెద్దుల ఆటపాటలు
- పొట్టేళ్ల విన్యాసాలు
- పందెపు కోళ్ల పోటీలు
- ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ముగ్గులను పరిశీలిస్తూ...



భోగిమంటల వద్ద...

అచ్చంపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి, తనయుడు కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. భోగి మంటలు, హరిదాసుల సంకీర్తనలు, పొట్టేళ్ల ఫీంకారాలు, పందెపు కోళ్ల విన్యాసాలు, గంగిరెద్దుల ఆటపాటలు, మహిళలకు ముగ్గుల పోటీలతో సంబరాలు అంబారాన్ని అంటాయి. వసంతకుమారి మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే ఎంత కష్టాన్ని అయినా ఇష్టంగా మార్చుకుంటారని నిరూపించారన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ మోహనరెడ్డిని గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని చెప్పారు. మరింత అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే ఎమ్మెల్యేగా శంకరరావును గెలిపించాలని కోరారు. ముగ్గుల పోటీలలో 500మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. మొదటి ఐదు స్థానాలు సాధించిన వారికి నగదు, ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. ప్రథమస్థానాన్ని అచ్చంపేటకు చెందిన బి.ధనలక్ష్మి రూ.40వేలు, రెండవ బహుమతి అచ్చంపేటకు చెందిన మల్లేశ్వరికి రూ.25వేలు, మూడో బహుమతి మర్యాద సుజాత, కోగంటివారిపాలెం రూ.15వేలు, నాల్గవ బహుమతి బైసాని భార్గవి, వేల్పూరు రూ.10వేలు, 5వ బహుమతి జి.నాగవర్ధని, అచ్చంపేట రూ.5వేలు, కన్సోలేషన్ బహుమతిని రుద్రవరం గ్రామానికి చెందిన అనుముల శివపార్వతి రూ.2వేలు దక్కించుకున్నారు. పోటీల్లో పాల్గొన్న 500మందికి వెయ్యి రూపాయలు విలువచేసే పప్పు కుక్కర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా కృష్ణానాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, లిడ్ క్యాప్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, సర్పంచ్ కంభాల వీరబాబు, ఉప సర్పంచ్ జాని, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి రంగయ్య, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టరు అంబటి నారాయణ, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి సాతర్ల శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు లక్ష్మి, మండల సమాఖ్య అధ్యక్షురాలు చల్లా రత్నమంజీర, నియోజకవర్గ నాయకులు కృష్ణారెడ్డి, గంగాధరరెడ్డి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకానికి కొండవీడు తలమానికం

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- పర్యాటక ప్రాంతంలో చెత్త సేకరణ వాహనం ప్రారంభించిన కలెక్టర్
- రూ.7 లక్షల వాహనం అందించిన గోల్కొండ గ్రూప్ అధినేత నడికట్టు రామిరెడ్డి
- వెదుళ్లచెరువులో బోటింగ్‌ను ప్రారంభించిన కలెక్టర్



చెరువులో జలవిహారం చేస్తున్న కలెక్టర్, ట్రైనీ కలెక్టర్, డీఎఫ్‌వో

యడ్లపాడు: కొండవీడు ఉమ్మడి గుంటూరు–కృష్ణా జిల్లాలకు తలమానికం కానుందని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. హైదరాబాదులోని గోల్కొండ గ్రూప్స్ అధినేత, చిరుమామిళ్లవాసి నడికట్టు రామిరెడ్డి కొండవీడు పర్యాటక ప్రాంతంలో చెత్త సేకరణ వాహనాన్ని అందించగా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఏర్పాటైన సభకు కొండవీడుకోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి అధ్యక్షత వహించగా కలెక్టర్ ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొండవీడు నగరవరం పేరిట సందర్శకులకు వసతుల్ని అందుబాటులోకి తెస్తుందన్నారు. అధికారులు అడిగిన వెంటనే రూ.7 లక్షల విలువైన వాహనాన్ని ఇచ్చేందుకు సుముఖత చూపడం దాతల్లో శ్రీమంతుడంటూ కొనియాడారు. జిల్లా అటవీశాఖ అధికారి ఎస్ రామచంద్రరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, జిల్లా కలెక్టర్ శివశంకర్‌ల ప్రత్యేక చొరవతోనే రెండేళ్లలో పర్యాటకంగా కొండవీడు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని వివరించారు. గోల్కొండ గ్రూప్స్ చైర్మన్ నడికట్టు రామిరెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల తరలింపు కోసం చెత్త సేకరణ వాహనాన్ని తమ గ్రూప్ తరపున అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కొత్త క్యాలెండర్, డైరీలను అతిథులు ఆవిష్కరించారు. వాహనపత్రాలను జిల్లా కలెక్టర్ శివశంకర్ అటవీశాఖ అధికారి రామచంద్రరావుకు అప్పగించి వాహనాన్ని ప్రారంభించారు.

బోటింగ్ లాంచింగ్

కొండపై ఉన్న వెదుళ్ల చెరువును చేరుకున్న కలెక్టర్ అక్కడ సిద్ధంగా ఉన్న జలవిహార క్రీడను ప్రారంభించారు. టికెట్ కౌంటర్‌తోపాటు బోట్ షికారు చేశారు. బోటు షికారులో కలెక్టర్‌తోపాటు ట్రైనీ కలెక్టర్ కల్పనశ్రీ, డీఎఫ్‌వో ఉన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు, ఎంపీడీవో వై హనుమారెడ్డి, ఫారెస్టు రేంజ్ అధికారి నాగమణి, బీట్ అధికారి పురుషోత్తమరావు, కవి వెంకటరెడ్డి, ఏజెన్సీ ప్రతినిధి ఆశాబలవాయి, మండల స్పెషల్ ఆఫీసర్ రాధారాణి, మాజీ ఎంపీపీ బాలచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా దక్షిణ భారత టీ-20

మేదరమెట్ల: సంక్రాంతి పండగ పురస్కరించుకొని రావినూతల క్రికెట్ స్టేడియంలో రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భ్రమర సంక్రాంతి కప్-2024 పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లలో థండర్ బోల్ట్స్ (తిరుపతి), ప్రసాద్ జీ స్పోర్ట్స్ లెవెన్ (హైదరాబాద్) జట్లు విజయం సాధించాయి. ఉదయం థండర్ బోల్ట్స్, మెగా వారియర్స్ (విజయవాడ) జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ ఆరంభించిన మెగా వారియర్స్ 18.2 ఓవర్లకు 103 పరుగులు చేసి, ఆలౌట్ అయ్యింది. క్రికెటర్ ప్రశాంత్ 34 పరుగులు చేశాడు. తిరుపతి బౌలర్ ప్రకాష్‌రెడ్డి 11 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు. మరో బౌలర్ డానియల్ 23 పరుగులు 3 వికెట్లు తీసి భారీ స్కోర్ చేయకుండా కట్టడి చేశారు. అనంతరం బ్యాటింగ్ ఆరంభించిన తిరుపతి 9.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి విజయం సాధించింది.

- మధ్యాహ్నం ప్రసాద్ జీ స్పోర్ట్స్ (హైదరాబాద్)– లయన్స్ క్రికెట్ క్లబ్ (బెంగళూరు) జట్ల మధ్య మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగింది. మొదట బ్యాటింగ్ ఆరంభించిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసింది. ఆదిత్యారెడ్డి 58 పరుగులు చేశాడు. 162 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ ఆరంభించిన బెంగళూరు దూకుడుగా ఆడింది. చివరి ఓవర్‌లో 15 పరుగులు చేయాల్సి ఉండగా.. పది పరుగులు మాత్రమే చేసింది. ఐదు పరుగుల తేడాతో హైదరాబాద్ విజయం సాధించింది. వ్యాఖ్యాతగా సాయిరాజ్, అంపైర్లుగా శ్రీనివాస్, వరప్రసాద్ వ్యవహరించారు.

రివైజ్డ్ ఫైనల్ మెరిట్ జాబితా విడుదల

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ అర్బన్ పీహెచ్‌సీల్లో ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్, లాస్ట్ గ్రేడ్ సర్వీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారి రివైజ్డ్ ఫైనల్ మెరిట్ లిస్టు విడుదల చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల సమాచారం కోసం గుంటూరు.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.







మెడికల్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: డాక్టర్ వైఎస్సార్ అర్బన్ పీహెచ్‌సీల్లో కాంట్రాక్టు పద్ధతిలో మెడికల్ ఆఫీసర్స్‌గా పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ కె.విజయలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.